బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నాయకుల చేరిక

బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 23 : పెద్దశంకరంపేట మండలం రామోజిపల్లిలో బుధవారం కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామోజిపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి సాయిలు, దంతెల యాకూబ్ సమక్షంలో చేరారన్నారు. మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు సురేశ్ గౌడ్, సుభాష్, దత్తు, యాదూల్, మానిక్‌రెడ్డి, విఠల్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

రజతోత్సవ సభకు భారీగా తరలుదాం

చిలిపిచెడ్, ఏప్రిల్ 23 : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చిలిపిచెడ్ మండలం నుంచి భారీగా తరలివెళ్తున్నట్లు బుధవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. మండలం నుంచి అన్ని గ్రామాల్లోని రైతులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లి కేసీఆర్‌కు అండగా ఉందమన్నారు.

ఛలో వరంగల్ పోస్టర్‌ను అతికిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్త

తూప్రాన్‌లో..

తూప్రాన్, ఏప్రిల్ 23 : మండుటెండల్ని సైతం లెక్క చేయకుండా.. ఊరు వాడ ఒక్కటై జై కొట్టి తెలంగాణ... అన్న అప్పటి ఉద్యమ గేయాన్ని స్ఫూర్తించేలా, ఈనెల 27న బీఆర్ఎస్ వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించతలపెట్టిన రజతోత్సవ బహిరంగ సభ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సభ విజయవంతం చేయడానికి ఉడతా భక్తిగా కార్యకర్తలు స్వచ్ఛందంగా, ఉత్సాహంగా ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉండగా 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది.

నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

రామాయంపేట, ఏప్రిల్ 23 : నేటితో పాఠశాలల విద్యా సంవత్సరం ముగిసింది. బుధవారం రామాయంపేట మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు విద్యార్థులకు ప్రోగ్రెస్‌లను అందజేసి ఇంటికి పంపించి వేశారు. గడిచిన ఏడాది కాలంగా పుస్తకాల బ్యాగులతో పరుగులు పెట్టిన విద్యార్థులు నిన్నటి వరకు పరీక్షలు రాసి నేడు ఇంటికి బ్యాగులతో పరుగులు పెట్టారు. ఆనందంగా చిందులు వేస్తు పాఠశాలకు బైబై చెబ్తూ వెళ్లిపోయారు. ఏప్రిల్ 24 నుంచి జూన్12 వరకు ప్రభుత్వం పాఠశాలలకు సెలవులను విధించింది. మళ్లీ పున:ప్రారంభం జూన్ 12 వరకు ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాలలను తెరవద్దంటూ పాఠశాల యజమాన్యాలకు నోటీసులను కూడా జారీ చేసినట్లు మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ తెలిపారు. ఒకవేల పాఠశాలలు గడువులోగా ప్రారంభిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నట్లు తెలిపింది.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

లక్ష్మాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్

తిప్పనగుల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంఘం సభ్యులు

రామయంపేట, ఏప్రిల్ 23 : ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, సుప్రభాత రావు అన్నారు. బుధవారం రామాయంపేట మండలం లక్ష్మాపూర్, తొనిగండ్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులంతా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లన్నగారి నాగులు, చింతల యాదగిరి, అరుణ్ కుమార్ ప్రశాంత్ కాసుల వెంకటేశం, రాగుల శ్రీనివాస్, రామలక్ష్మి ఉన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట, ఏప్రిల్ 23 : మండలంలోని నందగోకుల్, తిప్పనగుల్ల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీసీలు లక్ష్మీ,స్వరూప బుధవారం ప్రారంభించారు. నాణ్యత ప్రామాణాలు పాటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచించారు.

ధాన్యం కొనుగోలుపై దృష్టి సారించాలి

పాపన్నపేట, ఏప్రిల్ 23 : గ్రామాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం యూసుఫ్‌పేటలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.

పక్కాగా ధాన్యం సేకరించాలి

మహ్మద్ నగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నాగేశ్

కౌడిపల్లి, ఏప్రిల్ 23 : అకాల వర్షాల దృష్యా నిర్వాహకులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ నగేశ్ సూచించారు. బుధవారం మండలంలోని మహ్మద్ నగర్‌లో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తహసీల్దార్ ఆంజనేయులు సీఈవో దుర్గయ్య, రైతులు ఉన్నారు.

సీతారాముల విగ్రహాల పున:ప్రతిష్ఠ ఉత్సవాలు

పెద్దశంకరంపేటలో సీతారాముల విగ్రహాల పున: ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి, టీటీడీ పాలకమండలి సభ్యులు భాను ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు ఉన్నారు.

-పెద్దశంకరంపేట, ఏప్రిల్ 24

'భూభారతి'తో భూ సమస్యలు సత్వర పరిష్కారం

కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, ఏప్రిల్ 23 : భూభారతి పోర్టల్‌తో భూసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మాసాయిపేట రైతువేదికలో భూ భారతి అవగాహన సదస్సును నిర్వహించగా, ఈ సదస్సుకు హాజరైన కలెక్టర్ రైతులకు, నాయకులకు భూ భారతి పోర్టల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో 33 మాడ్యూల్స్ ఉంటే భూభారతిలో 6 మాడ్యూల్స్ ఉన్నాయని, దీంతో రైతులు సమస్యలను నేరుగా మాడ్యూల్స్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం భూ భారతి పైలట్ ప్రాజెక్టుగా ఉందని, జూన్ 2 నుంచి పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులోకి వస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్‌కు, ఆర్డీవోకు, కలెక్టర్‌కు చేసుకోవచ్చని, ఎక్కడా పరిష్కారం కాకుంటే కోర్టుకు వెళ్లవచ్చని, అప్పుడు కూడా ప్రభుత్వం రైతులకు న్యాయ సలహాలను అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి ఆధార్ నంబర్ ఉన్నట్టుగానే, రైతులకు భూదాన్ నంబర్ ఇవ్వనున్నట్లు, దీంతో రైతుల పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. అవగాహన సదస్సులో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఏడీఏ పుణ్యవతి, ఎంపీడీవో విఘ్నేశ్వర్‌లతో పాటు పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మాసాయిపేటలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం మండల కేంద్రమైన మాసాయిపేటకు వచ్చిన కలెక్టర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని, వంటగదులను, భోజన సరుకులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కలెక్టర్ వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఎంపీడీవో విఘ్నేశ్వర్‌లతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

కార్మిక చట్టాలు, హక్కులను కాపాడుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 23 : మేడే స్ఫూర్తితో కార్మికవర్గాల చట్టాలు, హక్కులను కాపాడుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చుక్క రాములు, భాస్కర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కేకే భవన్‌లో సీఐటీయూ ముఖ్య కార్యకర్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలోని హే మార్కెట్‌లో శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా 8 గంటల పని దినం కోరుతూ లక్షలాది మంది కార్మికులు ప్రపంచ కార్మికులందరి కోసం కార్మిక హక్కుల రక్షణకు తమ ప్రాణాలను అర్పించారన్నారు. ఇది మేడే అంతర్జాతీయ కార్మిక వర్గ ఐక్యతకు సంకేతమన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చి 4 లేబర్ కోడ్లను తెచ్చి కార్మిక హక్కులు, చట్టాలను కాలరాస్తుందన్నారు. హక్కులు, చట్టాలను కాపాడుకోవాడానికి మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, నర్సమ్మ, బాలమణి, నాగరాజు, అన్నపూర్ణ, నాగేందర్‌రెడ్డి, సంతోశ్ పాల్గొన్నారు.

'గీతా' విద్యార్థిని అభినందించిన కలెక్టర్

తూప్రాన్, ఏప్రిల్ 23 : ఇంటర్మీడియల్ పరీక్షా ఫలితాల్లో 468/470 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన 'గీతా కళాశాల' విద్యార్థిని కృతికను కలెక్టర్ రాహుల్ రాజ్‌తో పాటు తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి అభినందించారు. కృతిక గొప్ప విజయం సాధించటం పట్ల కళాశాల యాజమాన్యం, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కృతికను అభినందిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

గ్రామాలు నాలుగు.. లైన్‌మెన్ ఒక్కడే

ఇబ్బందులకు గురువుతున్న గ్రామస్తులు

నర్సాపూర్, ఏప్రిల్ 23 : నాలుగు గ్రామాలకు ఒక్కడే లైన్‌మెన్ ఉండడంతో విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు గ్రామస్తులు నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని గొల్లపల్లి, బ్రాహ్మణపల్లి, తుజాల్‌పూర్, తిర్మలాపూర్ వీటితో పాటు నాలుగు గిరిజన తండాలకు ఒక్కడే లైన్‌మెన్ ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈదురు గాలులు వీచిన సమయంలో విద్యుత్ వైర్లు తెగిపడిన ప్పుడు ఒక్కడే లైన్‌మెన్ తెగిపడిన విద్యుత్ వైర్‌ను కనుక్కోవడంలో పెద్ద సమస్య తలెత్తుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. నాలుగు గ్రామాలకు వీటితో పాటు నాలుగు తండాలకు నెలనెలా బిల్లింగ్ చేయాలంటే ఎన్నో తిప్పలు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి గ్రామానికి ఒక లైన్‌మెన్‌ను నియమించాలని కోరుతున్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సుపై అవగాహన

సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది కరుణాకర్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 23 : మండల కేంద్రంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సఖీ కేంద్రం, షీటీమ్, న్యాయవిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు న్యాయవాది కరుణాకర్, న్యాయవాది శ్రీనివాస్, సఖీ కేంద్రం అధికారి రేణుక, షీ టీమ్ అధికారి గంగమణి హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేణుక, గంగమణి, వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

చేగుంట, ఏప్రిల్ 23 : రోడ్డు ప్రమాదంలో వేర్వేరు ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఇండికేటర్ లేకుండా రోడ్డుపై అగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీ కొట్టిన సంఘటనలో మహిళ ఆర్ఎంపీ డాక్టర్ మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా చేగుంట సబ్ స్టేషన్ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజుల రామారం కుత్బుల్లాపూర్‌కు చెందిన కమ్మరి మంజుల (45) కామారెడ్డి జిల్లా రామారెడ్డి గ్రామం నుంచి స్కూటీపై వస్తుండగా, చేగుంట సబ్‌స్టేషన్ సమీపంలో లారీని రోడ్డుపై నిర్లక్ష్యంగా ఆపడంతో సడన్‌గా స్కూటీని ఆపింది. లారీని ఢీకొని తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలు కూతురు శృతిలయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చెస్తున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

నార్సింగి మండలంలో..

చేగుంట, ఏప్రిల్ 23 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం జెప్తీశివునూర్ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం చౌదర్‌పల్లికి చెందిన వల్లెపు సంతోశ్ గండి మైసమ్మ నుంచి బైక్‌పై వస్తుండగా జెప్తీశివునూర్ సమీపంలో అతి వేగంతో డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్రగాయాలైన సంతోశ్‌ను రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చెస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట, ఏప్రిల్23 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం చిన్నశంకరంపేట లోని రైతు వేదికలో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరై అవగాహన కల్పించారు. ఏవైనా భూ సమస్యలు ఉంటే గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకొని అట్టి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మెదక్ ఆర్డీవో రమాదేవి ఏడీఏ విజయనిర్మల తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్ మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రవీణ్ ఏఈవోలు, డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట,ఏప్రిల్ 23 : భూ వివాదాలను పరిష్కరించి, భూములపై పూర్తి హక్కును కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశ పెట్టిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. చేగుంట తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని అవగాహన కల్పించారు. తూప్రాన్ ఆర్డీవో జైచంద్రరెడ్డి,తహసీల్దార్ శ్రీకాంత్,ఏవో హరిప్రసాద్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 23 : హవేళీఘనపూర్ మాజీ జడ్పీటీసీ సుజాత శ్రీనివాస్‌రెడ్డి కూతురి వివాహం బుధవారం జిల్లా కేంద్రంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వివాహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, లింగారెడ్డి, జయరాజ్, సోములు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నిజాంపేటలో..

నిజాంపేట, ఏప్రిల్ 23 : చల్మెడ మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి కుమారుడి వివాహం సిద్దిపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వివాహానికి మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వారించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, మండల కో-అప్షన్ మాజీ సభ్యుడు అబ్దుల్ ఆజీజ్, నాయకులు భాస్కర్‌రావు, దయాకర్, మహేశ్, కిష్టారెడ్డి, పెంటయ్య, వెంకట్ స్వామిగౌడ్, లక్ష్మణ్, సిద్ధిరాములు తదితరులు ఉన్నారు.

వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి తదితరులు

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

తూప్రాన్, ఏప్రిల్ 23 : ఉగ్రదాడులపై దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు పెల్లుబిక్కుతు న్నాయి. బుధవారం సాయంత్రం తూప్రాన్ పట్టణంలో ప్రజలు ఉగ్రదాడికి నిరసనగా స్వచ్ఛందంగా ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

తూప్రాన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

ఉగ్రదాడి హేయమైన చర్య

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 23 : జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని బుధవారం బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, ఏప్రిల్ 23 : ఉగ్రవాదుల దాడిలో పలువురు పర్యాటకుల మృతి పట్ల సిద్దిపేట మున్సిపల్ చైర్పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పట్టణంలోని 24వ వార్డులోని శ్రీ సాయి విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని వారికి సంతాపం తెలిపారు.

చిన్నశంకరంపేటలలో..

చిన్నశంకరంపేట,ఏప్రిల్ 23 : పాకిస్తాన్ దాడులకు నిరసనగా బుధవారం రాత్రి చిన్నశంకరంపేట బస్టాండ్ వద్ద యువకులు కొవ్వొత్తుల ర్యాలీ తీసి నిరసన వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 23 : హుస్నాబాద్‌లో బుధవారం రాత్రి వివిధ సంఘాలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట కొవ్వత్తులు వెలిగించి అమరులకు నివాళులు అర్పించారు. నాయకులు చందుపట్ల నాగరాజు, గౌరిశెట్టి ప్రకాశ్, వివిధ సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, ఏప్రిల్ 23ః జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాకిస్థాన్ ఉగ్రమూకల దాడికి నిరసనగా రామాయంపేటలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ అధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని చేపట్టారు. పట్టణంలోని రాత్రి కొవ్వొత్తులను పట్టుకుని వీదులను తిరుగుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ కర్యాక్రమలంఓ రాగి రాములు, వెల్ముల సిద్దరాములు, అశినాష్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రామాయంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నిజాంపేట, ఏప్రిల్ 23 : మండలంలోని కల్వకుంటలో రూ.12.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను బుధవారం నాయకులు రవీందర్‌రెడ్డి, మసూద్ ప్రారంభించారు. మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, కాలనీవాసులు ఉన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు పరికరాలు అందజేత

దివ్యాంగ విద్యార్థులకు పరికరాలు అందజేస్తున్న ఎంఈవో యాదగిరి

నిజాంపేట, ఏప్రిల్ 23 : నిజాంపేట లోని ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు పరికరాలను ఎంఈవో యాదగిరి అందజేసినట్లు బుధవారం ఐఈఆర్పీ రాజయ్య, నరేశ్ తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు అలీమైకో సంస్థ మందుస్తుగా క్యాంప్ నిర్వహించి పరికరాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం

కమిటీ చైర్మన్ అశోక్‌గౌడ్‌కు విరాళం అందజేస్తున్న లక్ష్మీశంకర్

నర్సాపూర్, ఏప్రిల్ 23 : నర్సాపూర్ పట్టణ సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదుట ఏర్పాటు చేయనున్న ధ్వజస్తంభానికి నర్సాపూర్ పట్టణానికి చెందిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు, గురు స్వామి సీహెచ్.లక్ష్మీశంకర్ బుధవారం రూ. 2.25 లక్షల విరాళాన్ని దేవాలయ కమిటీ చైర్మన్ అశోక్ గౌడ్‌కు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

గ్రంథాలయ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

రేగోడ్, ఏప్రిల్ 23 : మండల కేంద్రంలో గ్రంథాలయ నిర్మాణ పనులను బుధవారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి పరిశీలించారు. గ్రంథాలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సెక్రటరీ వంశీకృష్ణ, లైబ్రెరియన్ సుజాత ఉన్నారు.

చికిత్స పొందుతూ విషమించి యువకుడి మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 23 : చికిత్స పొందుతూ విషమించి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొడుపాకలో చోటుచేసుకుంది. ఏఎస్సై సంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీకాంత్(24) స్వర్ణకారుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 21న రాత్రి ఇంట్లో భార్య, తల్లి మద్య సంసార విషయంలో చిన్నపాటి గొడవ చోటు చేసుకుంది. ఇద్దరిని ఏమీ అనలేక మనస్తాపం చెందిన శ్రీకాంత్ వంటింట్లోకి వెళ్లి నిప్పంటించుకున్నాడు. వెంటనే గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు తరలించి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ విషమించి బుధవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

పాపన్నపేట, ఏప్రిల్ 23 : మండల కేంద్రం పాపన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పాఠశాల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం మహేశ్వర్ తెలిపార